ప్రజాశక్తి

సోమవారం 24 జులై 2023 5 శ్రీ సత్యసాయి

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బి.సుధీంద్రనాథ్

ప్రజాశక్తి - గుత్తి

ఎపి బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన బి.సుధీంద్రనాథ్ ఎన్నిక య్యారు. ఈమేరకు ఆదివారం కర్నూలులోని దేవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ గౌర సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ హాజరై ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జ్వాలాపురం శ్రీకాంత్‌ను పలువురు సత్కరించారు.

సుధీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

పెరుగుతున్న డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులు

కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

పేరుకుపోయిన డ్రయినేజీ

ఖాళీస్థలంలో ఏర్పడిన మురుగు గుంత

జిల్లా వాసులను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత రెండేళ్లలో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో రోగుల సంఖ్య అధికంగానే ఉంది. అయితే ఆరోగ్యశాఖ లెక్కలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆ శాఖ లెక్కల కంటే రెండింతలు గ్రామాల్లో జ్వర పీడితులు ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపైనా, మురుగుగుంతల్లో నీటి నిల్వలు ఏర్పడుతున్నాయి. వాటిలో దోమల ఉత్పత్తి పెరిగింది. దీంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు అక్కడక్కడ డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ప్రధానంగా హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 4700 ఖాళీ స్థలాలు ఉన్నాయి. అయితే వీటి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉందని తెలుస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఈ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిలో పందులు ఆవసాలుగా ఏర్పాటు చేసుకున్నాయి. ఈ అపరిశు భ్రతతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పాటు నీటి పారుదల శాఖకు చెందిన కాలువలను పురపాలక సంఘం వారు మురుగు కాలువలుగా మార్చుకున్నారు. ఆ కాలువలను శు భ్రం చేయక పోవడంతో ఆ కాలువల వద్ద దుర్వాసన వెదజల్లుతున్నాయి. వీటిపై గ్రామ, వార్డు శానిటేషన్ సెక్రెటరీలు, వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆ స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు, కాలువలు నిండి రోడ్డుపైకి నీళ్లు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే కాస్తా కట్టడి చేయాడానికి అవకాశాలు ఉన్నాయి. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 543 ఉప ఆరోగ్య కేంద్రాలు, 7 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. వీటితో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు ప్రతి సచివాలయానికి ఒక ఎఎన్ఎం ఉన్నారు. అయినప్పటికి ఒక్క హిందూపురం పట్టణంలోనే రోజుకు 800 నుంచి 1000 కి పైగా వివిధ అసుపత్రులకు జ్వర పీడితులు వెళ్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హిందూపురం జిల్లా అసుపత్రిలోనే రోజుకు 300 నుంచి 400 పైబడి జ్వరబాధితులు వస్తున్నారు. అయితే ఇందులో వైరల్ జ్వరాలతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అధికారులు చూపుతున్న మలేరియా, డెంగీ కేసులకు మూడింతల మంది ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు పట్టణంలో ఉన్న ఆర్ఎంపిల వద్ద సైతం వైద్య సేవలు పొందుతున్నారు. వీరు సూది మందు ఇవ్వకూడదని నిబందనలు ఉన్నా వారు సూది మందుతో పాటు ఏకంగా సెలెన్ బాటిళ్లు సైతం ఎక్కిస్తున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న జిల్లా ఆసుపత్రి

పట్టణంతో పాటు గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో హిందూపురం జిల్లా ఆస్పత్రిలో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. అదేవిధంగా ఒపి సంఖ్య 800 నుంచి వెయ్యికి పెరగ్గా, ఇన్‌పేషంట్లు 200 మందికి పైగా ఉంటారు. ఒక్క చిన్న పిల్లల వార్డులోనే 110 నుంచి 130 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ఒపి విభాగంలో 70 నుంచి 80 శాతం మంది జ్వర పీడితులే ఉన్నారు. ఇందులో డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ల్యాబ్, ఓపీ గదుల వద్ద అందరూ జ్వరబాధితులే ఉన్నారు. దీంతో జ్వరపీడితులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ముఖ్యంగా అత్యవసర విభాగం, ఒపి గదులు, ల్యాబ్, మందుల పంపిణీ గది, వార్డులన్నీ జ్వర బాధితులతో నిండిపోయాయి. ఫీవర్ టెస్టులకే సమయం సరిపోతోందని, ఇక మిగతా టెస్టులు చేసేందుకు సమయం చాలడం లేదని ల్యాబ్ సిబ్బంది చెబుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరబాధితుల్లో ప్లేట్‌లెట్ కౌంట్ 1.50 లక్షలకు తగ్గకుండా ఉంటే డెంగీ సోకదని అంటున్నారు. తెల్ల రక్తకణాల సంఖ్య పడిపోతే వ్యాధి తీవ్రత పెరిగి మరణాలు సంభవించే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. టైఫాయిడ్‌కు గురైన మనిషి కోలుకోవడానికి 20 రోజులు పడుతుందని అంటున్నారు. మెరుగైన వైద్యం అందించకుంటే పరిస్థితి విషమించే అవకాశం ఉందన్నారు. చాలామంది టైఫాయిడ్ బాధితులు ప్రభుత్వాస్పత్రి సహా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటన లేకపోవడంతో జ్వరాలు ఎక్కువైనట్లు విమర్శలున్నాయి. ఇంటింటి సర్వేలో భాగంగా జ్వరబాధితులను గుర్తించి వైద్యసేవలు అందించి ఉంటే కేసులు పెరిగేవి కావన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తే వ్యాధులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఎక్కువగా అనుమానిత డెంగీతో పాటు టైఫాయిడ్ కేసులు వస్తున్నాయి. జ్వర బాధితులకు తొలుత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆ తరువాత చికిత్స అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సాధారణ జ్వరమైనా ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే వ్యాధి వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం వచ్చిన బాధితుల్లో డెంగీ లక్షణాలు కనబడుతున్నాయి. వీరికి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నాము. దీంతో పాటు ఫ్లూయిడ్స్, మందులతో రక్తకణాల సంఖ్య పెంచుతున్నాం. జబ్బుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ అఫ్తాబ్,
చిన్నపిల్లల వైద్య నిపుణులు

పల్లె X దుద్దుకుంట

వేడెక్కుతున్న పుట్టపర్తి రాజకీయం

వైసిపి, టిడిపిల మధ్య పోటాపోటీగా మాటల యుద్ధం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతుంది. సాధారణ ఎన్నికలకు ఇంకా 9 నెలలు ఉన్నప్పటికీ అధికార పార్టీ అయిన వైసీపీ, ప్రతిపక్షమైన టిడిపిల మధ్య పరస్పర మాటలు యుద్ధం కొనసాగుతోంది. నిరసనలు రూపంలో రాజకీయ వేడి మొదలైంది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కెనరా బ్యాంకులో అప్పు చేసిన రూ. 908 కోట్లు చెల్లించకపోవడంతో ఆ బ్యాంకు ఆగస్టు 18న ఎమ్మెల్యే ఆస్తులను వేలం వేస్తామని ప్రకటించడంతో ప్రతిపక్ష పార్టీకి ఒక అస్త్రం దొరికినట్లు అయింది. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అఫిడవిట్లో తన ఆస్తులు చూపించలేదని బ్యాంకు ప్రకటించిన అప్పులతో పాటు బయట ఇంకా ఎన్ని అప్పులు ఉన్నాయో అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జగన్ కు బినామీ అని చెప్పుకుంటూ తన సిరాస్తులు కన్నా ఎక్కువ అప్పులు చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తూ తక్షణం ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఓడిసి మండల కేంద్రంలో పల్లెతో పాటు ఆ పార్టీ నాయకులు ధర్నా చేసి నిరసన తెలిపారు. మరొకవైపు వ్యాపారాలు అన్నాక అప్పులు చేసిన మాట వాస్తమేనని, అప్పు చేస్తే ఎగర కొట్టినట్లు ప్రచారం చేయడం పట్ల ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే రుణ వాయిదాలు చెల్లిస్తామన్నారు. తమ పార్టీలోనే ఉన్న ఒక కురువృద్ధుడు 'పల్లె'తో చేతులు కలిపి కుట్ర చేస్తున్నారని పరోక్షంగా కొత్తకోట సోమశేఖర్ రెడ్డిని ఉద్దేశించి మీడియా ముందు ఆరోపించారు. వైసిపి నాయకులు ఓడిసి, నల్లమాడ, పుట్టపర్తి మండల కేంద్రాలలో 'పల్లె'కు వ్యతిరేకంగా నిరసనలు చేశారు. కొత్తకోట సోమశేఖర్ రెడ్డి వెన్నుపోటు రాజకీయాలు చేయవద్దని హెచ్చరించారు. గత రెండు నెలల క్రితం టిడిపి వర్గీయులు, వైసీపీ శ్రేణులు పట్టణం నడిబొడ్డున హనుమాన్ కూడలిలో బాహబాహికి దిగి రాళ్లతో,చెప్పులతో దాడికి దిగారు. ఈ సంఘటన మరవక ముందే తిరిగి ఒకరిపై ఒకరు ఆరోపణలు నిరసనలకు దిగి నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయం రాజేశారు. అయితే ఈ సంఘటనలు ఎక్కడికి దారితీస్తాయోనని ఇరు పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాల యేసు డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాచేసిన సన్మానసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో విన్నూత పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఉపాధ్యాయులు సహకారం అందివ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందన్నారు. 2008, 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై ఈశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, ఎ.గోపాల్, సాల్మన్‌రాజ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, మంజూనాథ్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

టిడిపితోనే మహిళాభ్యున్నతి

మహాశక్తి చైతన్య యాత్రలో పరిటాల సునీత

మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-కనగానపల్లి

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే ఒక్క టిడిపితోనే సాధ్యమని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాశక్తి చైతన్యయాత్ర ఆదివారం మండల పరిధిలోని ముత్తవకుంట్ల నుంచి ప్రారంభమైంది. ముందుగా రామగిరి మండలంలోని వెంకటాపురంలో మహిళా శక్తి చైతన్య రథానికి సునీత మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి టిడిపి జెండా ఊపి ప్రారంభించారు. అలాగే పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ముత్తవకుంట్ల గ్రామానికి చేరుకొని యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీతకు గ్రామస్తులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్థులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల ను గుర్తించి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రత్యేకంగా పథకాలు రూపొందించారన్నారు. రాప్తాడు నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని ధ్వజమెత్తారు. టిడిపి అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షురాలు సుబ్బ రత్నమ్మ, గాండ్ల సాధికార సమితి అధ్యక్షురాలు విశాలాక్షి, హిందూపురం పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైతులకు ఊరటనిస్తున్న అరటి

అరటిగెలను చూపుతున్న రైతు శివప్రసాద్

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

ప్రపంచంలో అరటి ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానం. అంతేకాక జాతీయస్థాయిలో అరటిపంటదే మొదటి స్థానం. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా తమిళనాడు అరటిపండ్ల తోటల సాగులో ముందు స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లో రైతులకు కాస్తా ఊరటను ఇస్తున్న పంటలలో అరటిపంట కూడా ఒకటి. ఒకప్పుడు అరటి పంట సాగు చేయాలంటే పెట్టుబడులకు కూడా తిరిగి వచ్చేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడు ఎకరాకు ఖర్చులు పోను దాదాపు రూ. 3 లక్షల నుంచి మూడున్నర లక్షల రూపాయల వరకు మిగులుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అరటి పండ్ల రేట్లు పెరగడంతో రైతు ముఖంలో ఆనందం చూస్తున్నామని అరటితోట సాగు రైతు శివప్రసాద్ అన్నారు. అరటి పంట సాగు విధానం లాభనష్టాలపై రైతు శివప్రసాద్ తన అనుభవాన్ని వివరించాడు. గతంలో ఇతర పంటల సాగు ఎంత పెట్టుబడి పెట్టినా పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేవి కాదన్నారు. దీంతో పాడి పశువుల పై ఆధారపడి కుటుంబాన్ని పోషించేవాడినని అన్నారు. పాలు అమ్మకొంటూ బోరు బావిలో నీరును పట్టణంలో ట్యాంకులు ద్వారా సరఫరా చేస్తూ జీవనం సాగించేవాడనని అన్నారు. అయితే తన

ఆశాజనకంగా దిగుబడి

బావ పులివెందుల ప్రాంత వాసి అని ఆయన ప్రోద్భలంతో తనకున్న రెండున్నర ఎకరా పొలంలో అరటి సాగు చేసినట్లు వివరించారు. హైదరాబాదు ప్రాంతం నుండి విక్టోరియా అనే రకాల అరటి పిలకలను ఒక్కొక్కటి 14 రూపాయలు చొప్పున 2500 మొక్కలను కొనుగోలు చేసి సాగు చేశానని చెప్పారు. ఎరువులు, రసానక ఎరువులు, డ్రిప్ మందులు తదితర వాటికి దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చయిందని అన్నారు. మొదటి పంట అయినందువల్ల పంట బాగా వచ్చిందని, రెండున్నర ఎకరాకు దాదాపు 65 టన్నులు వరకు దిగుబడి వచ్చిందని తెలిపారు. టన్ను రూ. 18వేలతో 65 టన్నులకు దాదాపు రూ. 11.70 లక్షల వరకు వచ్చిందని అన్నారు. పెట్టుబడి రూ.2 లక్షలను పోనూ తనకు రూ.9.70 లక్షలకు మిగిలిందని ఆనందం వ్యక్తం చేశారు. కర్నాటక ప్రాంతవాసులు తోట వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేశానని రైతు శివప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం అరటిపంటకు ఉన్న ధరలను అసలు ఊహించలేదని అన్నారు. అరటి తోట సాగుకు తొలిసారి మాత్రమే ఖర్చు అధికంగా ఉంటుందని చెప్పారు. ఈ పంటకు ఈదురు గాలుల నుండి నష్టం వాటిల్లుతుందే కానీ ఇతర తెగుళ్లు ఉండవన్నారు. ఏవైనా తెగుళ్ల కనపడిన వెంటనే ఆ అరటి పిలకను తొలగిస్తే సరిపోతుందని అన్నారు. అరటి సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి పంటసాగుకు ప్రోత్సహిస్తే కరువుజిల్లా రైతులకు ఈ పంట కాస్త ఊరటగా ఉంటుందని రైతు శివప్రసాద్ తెలిపారు.

ప్రజలు సహకరిస్తే భూ రీసర్వే సులభతరం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ హక్కు, భూ రక్ష పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రీ సర్వేకి ప్రజలు సహకరిస్తే పనులు సులభతరం అవుతాయని సత్యసాయి జిల్లా సర్వే భూములు, రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ జిపి.రామకృష్ణ తెలిపారు. రెవెన్యూ శాఖ అంటేనే భూ తగాదాలు, రహదారులు, సాగు పట్టాలు, భూ ఆక్రమణలు తదితర సమస్యలను పరిష్కరించాలని మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల చుట్టూ ప్రజలు తిరుగుతూ ఉండటాన్ని నిత్యం చూస్తూ ఉంటామన్నారు. కొన్ని భూ సమస్యలు కోర్టు వరకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయన్నారు. కుటుంబంలోనే ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూతగాదాలు నెలకొంటున్నాయని చెప్పారు. భూ సమస్యలపై చాలాసార్లు గొడవలు జరగటం, ఇరువర్గాలూ పోలీసులను ఆశ్రయిస్తుంటారన్నారు. ఇలాంటి భూ సమస్యలన్నీ రీ సర్వే వల్ల పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారా ?

జవాబు : ప్రజలు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నాం. 100 ఏళ్ల తర్వాత ప్రభుత్వం భూహక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే చేపట్టింది. సర్వే రాళ్లను కూడా ప్రభుత్వం సమకూర్చుతోంది. రీ సర్వేలో శాశ్వత భూ హక్కు రైతులకు కలుగుతుంది. సర్వే కోసం డ్రోన్లు, విమానాలను సైతం ప్రభుత్వం వినియోగిస్తూ ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు ఉండదు. సర్వే కోసం గ్రామానికి వచ్చిన సిబ్బందికి తమకి ఉన్న భూమి పట్టాలు, పట్టా పాసు పుస్తకాలు ఇస్తే సులభంగా సర్వే చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

జిపి.రామకృష్ణ, సత్యసాయి జిల్లా సర్వే భూములు, రికార్డు అసిస్టెంట్ డైరెక్టరు

ప్రశ్న : రీ సర్వేలో ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి ?

జవాబు : సహజంగానే గ్రామాల్లో భూ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఉదాహరణకు ఒకరి కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల్లో ఒకరు 10 సెంట్లు ఎక్కువ సాగు చేస్తుంటారు. అప్పుడు ఇద్దరూ అంగీకారానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అలాగే కొన్ని భూములు ఆక్రమణలు, అన్యాక్రాంతమై ఉంటాయి. కొన్ని కోర్టులో ఉంటాయి. అవన్నీ రీ సర్వేలో వెల్లడయ్యే అవకాశం ఉంది. వాటిని పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక డిప్యూటీ తహశీల్దారును ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించింది. వారి పరిధిలో పరిష్కారానికి కృషి చేస్తారు. జఠిలమైన సమస్యలు ఉంటే ప్రజలు అప్పీలు చేసుకోవచ్చు.

ప్రశ్న : జిల్లాలో ఎంత సాగుభూమి ఉంది. ఎన్ని గ్రామాలు ఉన్నాయి ?

జవాబు : సత్యసాయి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల భూమి ఉంది. 460 గ్రామాలు ఉన్నాయి ఇప్పటివరకు రెండు దశల్లో సర్వే పూర్తి అయింది. మూడవ దశలో సర్వే చేపట్టనున్నాం. ప్రతి దశలోనూ 26 గ్రామాలకు ఎంపిక చేసుకుని సర్వే చేపడుతున్నాం. మూడవ దశలో కూడా 26 గ్రామాలకు ఎంపిక చేసుకున్నాం. త్వరలోనే మూడవ దశ కూడా పూర్తి చేస్తాం. ఇప్పటికి దాదాపు 5వేల ఎకరాల్లో సర్వే పూర్తి అయింది.

ప్రశ్న : జిల్లాలో ఎప్పుడు సర్వే ప్రారంభించారు. ఎప్పటి లోపు పూర్తి కావొచ్చంటారు ?

జవాబు : ఒక ఏడాది నుంచి సర్వే పనులు చేపట్టాం. జిల్లాలో పూర్తి గ్రామాల్లో సర్వే పూర్తి కావాలంటే మరో ఐదారు సంవత్సరాలు పట్టవచ్చు. అసైన్డ్ భూములు, పూర్వపు పట్టాలు, దేవాలయ భూములు, ఇలా పలు రకాల భూములు ఉన్నాయి. నోటీసులు ఇచ్చిన గ్రామాల్లో మొదట అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సర్వే ఉద్దేశాలను ప్రజలకు వివరిస్తాం. కాబట్టి కోర్టు పరిధిలో ఉన్న భూములు మినహాయిస్తే రైతుల దగ్గర ఉన్న ఆధారాల మేరకు సర్వే పూర్తి చేస్తాం.

జిపి.రామకృష్ణ,
జిల్లా సర్వే భూములు, రికార్డు అసిస్టెంట్ డైరెక్టరు

ప్రశ్న : సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జవాబు : అలాంటి సమస్య లేదు. రీ సర్వేపై నెలలో రెండు సార్లు కలెక్టర్ సమీక్షిస్తారు. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం సమకూరుస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే ఇదొక బృహత్తర కార్యక్రమం. ఆయా గ్రామాల్లో ప్రజలు సర్వే అధికారులకు సహకరిస్తే సిబ్బందికి భూ రీ సర్వే సులభతరం అవుతుంది.

మణిపూర్ మారణకాండ మానవత్వానికి మచ్చ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మణిపూర్ మారణకాండ మానవత్వానికి మచ్చ నశ్రీతీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న మారణకాండను ఖండించారు. మణిపూర్ ముఖ్యమంత్రి చర్యలు అల్లర్లనే ప్రేరేపించేలా ఉన్నాయన్నారు. మహిళను నగ్నంగా ఊరేగించి మానభంగం చేసి హత్యచేయడం మానవత్వానికి మచ్చగా మారిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్‌లో మారణకాండకు ముగింపు పలకాలని కోరారు. కార్యక్రమం లో స్థానిక యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, హరికృష్ణ, రామాంజనేయులు, అమరనారాయణ రెడ్డి, విజయభాస్కర్, సాయిగణేశ్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలి

హిందూపురం : మణిపూర్‌లో మహిళలపై మానవ మృగాలు జరిపిన అత్యాచారం, హత్యలను జన విజ్ఞాన వేదిక నాయకులు ఖండించారు. పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జెవివి జిల్లా సర్వసభ్య సమావేశంలో మణిపూర్ సంఘటనపై

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి నాయకులు

చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఈటి రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన సంఘటనలు అమానుషం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెవివి నాయకులు రామకృష్ణ, అతావుల్లా, ప్రభాకర్, అబ్దుల్‌హక్, అలీముల్లా, హనుమంతు, శ్రీనివాసులు, మారుతీ, రమేష్, హరి, చంద్రశేఖర్ రెడ్డి, అనిల్, ఉమామహేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేకులకుంట 'గురుకులం'లో సమస్యలు తిష్ట

ప్రజాశక్తి-మడకశిర

బురదమయమైన పాఠశాల ప్రాంగణం

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందిస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొంటున్నా ఆచరణలో అమలు కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇందుకు మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల నిదర్శనమని చెప్పవచ్చు. ఈ పాఠశా లలో సమస్యలు తిష్టవేశాయి. ముఖ్యంగా పైకప్పు లీకేజీ అవుతుండడంతో చిన్నపాటి వర్షం కురిసినా గదులు జలమయం అవుతున్నాయి. దీంతో విద్యార్థులు రాత్రివేళ నిద్రించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పెట్టెలు ఒకదానిపై ఒకటి పేర్చి ఉన్న స్థలంలోనే సర్దుకుని జాగారణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదమయం అవుతోంది. దీంతో విద్యార్థులు కనీసం తరగతి గదిలోకి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గుండుమల గ్రామంలో నేటికీ గురుకుల పాఠశాల భవనం ప్రారంభానికి నోచుకోక అర్ధాంతరంగానే నిలిచిపోయింది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

వెంగమునిరెడ్డి(ఫైల్)

ముదిగుబ్బ : మండల పరిధిలోని మర్తాడు గ్రామ సమీపంలో ఆదివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈదులపల్లి గ్రామానికి చెందిన వెంగమునిరెడ్డి(35), సరళ దంపతులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ మర్తాడు సమీపంలో గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొనడం తో వెంగమునిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా సరళకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడు...

ప్రమాదంలో మృతిచెందిన కిరణ్

నల్లమాడ : మండల పరిధిలోని ఎర్రవంకపల్లి సమీపంలోని గువ్వలకొండ పరిసరాల్లో శనివారం రాత్రి బుక్కపట్నం మండలంలోలని అగ్రహారానికి చెందిన కిరణ్(27) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అగ్రహారానికి చెందిన కిరణ్‌తో పాటు రాము, ఓబులేసు, అనంతయ్య శనివారం రాత్రి వేటకు వచ్చారు. ఈ క్రమంలో విద్యుత్ తీగ కాలికి తగిలి రాము అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఆదివారం ఉదయం సిఐ రాజేంద్రయాదవ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. శవాన్ని పోస్టుమార్టం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

పేకాటజూదరుల అరెస్ట్

అమరాపురం : మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న 16 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు మడకశిర సిఐ సుధాకర్‌బాబు తెలిపారు. మండలంలో పేకాట, కర్నాటక మద్యం అక్రమ తరలింపుపై అందిన సమాచారం మేరకు మడకశిర సిఐ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ ఆంజనేయులు దాడులు చేసి వి.అగ్రహారం సమీపంలో పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి 13 సెల్‌ఫోన్లు, 9 ద్విచక్ర వాహనాలు, రూ. 1,60,150 స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని మడకశిర సివిల్ జడ్జ్ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.దాడుల్లో జమేదార్ మధుసూదన్, కానిస్టేబుల్ రమేష్, హోంగార్డ్ రంగప్ప పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

కొత్తచెరువు : స్థానిక శివాలయం వద్ద ఆదివారం ఓ యువకుడిపై కొందరు స్థానిక యువకులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. పెనుకొండకు చెందిన ఓ యువతి, పాలసముద్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి స్థానిక బుక్కపట్నం రోడ్డులోని శివాలయం వద్ద ఉండగా అటు వెళ్లిన కొందరు యువకులు వారిని గమనించి యువకుడిపై దాడి చేశారు. దీంతో బాధిత యువతీ, యువకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై లింగన్న దాడికి పాల్పడిన యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే ఇకపై ఇలాంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీని ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన పట్టణంలోని ఓ హోటల్‌లో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రయివేటు పాఠశాలల నిర్వాహకుల సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. అనంత రం ఎమ్మెల్సీ మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో శ్రీనివాసులు, రియాజ్, వేణుగోపాల్ తన గెలుపునకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల ప్రతి సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా న్నారు. పాఠశాలల నిర్వాహకులు సైతం వారి పాఠశాలలను అభివృద్ధి చేసుకుంటూ సాంకేతికంగా ముందుకుపోవా లని సూచించారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వర్షిణి, లాస్య చేసిన భరత నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అపుస్మా జిల్లా నాయకులు వేణుగోపాల్, రియాజ్, మధు, గౌస్, ముస్తాఫా అలీఖాన్, అనంతపురం జిల్లా అపుస్మా నాయకులు పుల్లారెడ్డి, రామిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డిపై పల్లె రఘునాథ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎంపిపి రమణారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు షాజ హాన్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షు లు సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆదివా రం దర్గా ప్రాంతం నుంచి నాలుగు రోడ్ల కూడలి వెళ్లి ధర్నా చేయడానికి సిద్ధం అవుతుండగా సిఐ రామయ్య, ఎస్సై లింగన్న, పోలీసులు వారిని అడ్డుకొని దర్గా ఆవరణలోకి పంపించారు. దీంతో వైసిపి నాయకులు దర్గా మైదానంలో నిరసన తెలిపి పల్లెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే అధ్యా పక వృత్తి నుంచి వచ్చిన పల్లె అనతికాలంలోనే వందల కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో భాస్కర, వెంకటరాముడు, ధనుంజయ, సుబ్బారావు, ఎంపిటిసి రఫీ, అజీజ్, ఆంజనేయులు, తిరుమల దేవరపల్లి సర్పంచ్ కేశవరెడ్డి పాల్గొన్నారు

కొత్తచెరువు : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని మేజర్ పంచాయతీ సర్పంచి రాధానాగరాజు, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు వాల్మీకి శంకర్ తెలిపారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేపై కావాలనే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అశోక్, డీలర్ మారుతి, బళ్లారి బాబు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

'గుండుమల'పై విమర్శలు తగదు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వా మిపై మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శలు చేయడం సబబుకాదని టిడిపి నాయకులు పలికారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు మనోహర్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో గుండుమల తిప్పే స్వామి పట్టుబట్టి పార్టీ అధిష్టా నాన్ని ఒప్పించి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించిన విషయం మరిచి పోయావా అని ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్యేతో కుమ్మక్కైన నీకు గుండుమలను విమర్శించే నైతికహక్కు లేదన్నారు. ఇకనైనా అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు.

మడకశిరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అనంతరం నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథిరెడ్డి రాయలసీమలో ఏ గ్రేడ్ సాధించడం పట్ల పార్టీ వారు అభినందనలు తెలిపారు.

పార్టీ కేడర్‌లో విభేదాలు సృష్టించొద్దు

రొళ్ల : పార్టీ కేడర్‌లో విభేదాలు సృష్టించవద్దని రొళ్ల టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు సూచించారు. స్థానిక లక్ష్మీ ప్యాలెస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో 2019లో టిడిపి ఓటమికి ఈరన్నే కారణమన్నారు. పార్టీ అధిష్టానం విశ్వాసం కోల్పోయిన నీవు గుండు మల తిప్పేస్వామిపై అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవా లని, లేనిచో మడకశిర ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో దాసిరెడ్డి, గురుమూర్తి, జికె.ఈరన్న, భరత్, రామకృష్ణ, కిష్టప్ప, సిద్దగంగప్ప, కృష్ణమూర్తి, నాగరాజ్, వెంకటేష్, పాల్గొన్నారు.

రొళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆర్‌ఎంపిలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలి

లేపాక్షి : ఆర్‌ఎంపిలు ప్రాథమిక వైద్య చికిత్స మాత్రమే చేయాలని, ఎటువంటి వైద్యం చేయకూడదని డాక్టర్ వెంకట చిరంజీవి హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మండల వ్యాప్తంగా ఉన్న ఆర్‌ఎంపి లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఎంపిలు సెలైన్ ఎక్కించడం, ఇంజక్షన్ వేయ డం చేయకూడదని, అలా ఎవరైనా వైద్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సిబ్బంది సుబ్రహ్మణ్యం, ఆర్‌ఎం పిల యూనియన్ అధ్యక్షులు గోవిందురాజులు, శ్రీనివాసులు, అల్లాబకాష్, వెంకటేష్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపిలకు సూచనలు చేస్తున్న డాక్టర్ వెంకట చిరంజీవి

25న విద్యాసంస్థల బంద్

తలుపుల : ఈ నెల 25వ తేదీ కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఐక్య విద్యార్థి యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. తలుపులలో ఆదివారం వారు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

చంద్రశేఖర్ అజాద్‌కి నివాళి

పెనుకొండ : స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు చంద్రశేఖర్ అజాద్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక మిట్ట మీద ఆంజనేయస్వామి ఫంక్షన్ హాలులో మాజీ సర్పంచి కె.శ్రీనివాసులు అధ్యక్షతన అజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో మీడియా ప్రతినిధి రవూఫ్, హైకోర్టు న్యాయవాది హెచ్.శివరామకృష్ణ, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, నారాయణస్వామి, నంజుండ, ఎం.బాషా, నరసింహులు, రవికుమార్, టెంపో శీశ, నారాయణ, పాల్గొన్నారు.

చంద్రశేఖర్ అజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు, తదితరులు

నాడు-నేడు పనుల పరిశీలన

గోరంట్ల రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి. రామచంద్రారెడ్డి ఆదివారం మండల పరిధిలోని గుమ్మయ్య గారిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి నాడు-నేడు పనులను పరిశీలించారు. అలాగే పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దామో దరరెడ్డి ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్ర మంలో విద్యాసాగర్, నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, నాగేనాయక్, రంగారెడ్డి, మురళి, నాగేంద్ర, మోహన్‌రెడ్డి, వెంకట్రాముడు, శివారెడ్డి, రమేష్, నరసింహారెడ్డి, నాగరాజు, రవీంద్ర, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కావేరి హాస్పిటల్స్ బెంగళూ రు వారి సహకారంతో ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పంద న లభించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎంఎం పృథ్వీరాజ్ తెలిపారు. ఈ శిబిరం లో కార్డియాలజీ డాక్టర్ ఎన్‌పి జ్ఞానదేవ్ 120 మంది పరిశీలించి, 21 మందిని యాంజియోగ్రా మ్‌కు, 12 మందిని కార్డియో చికిత్సకు బెంగళూరు లోని కావేరి హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. జనరల్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో 98 మందికి వైద్య పరీక్షలు చేసి సలహాలు సూచనలు చేశారు. అలాగే చిన్నపిల్లల వైద్య నిపుణులు రిషిత ఆసుపత్రి డాక్టర్ సివి మదన్‌కు మార్, డాక్టర్ భాస్కం

హాజరైన కావేరి వైద్య సిబ్బంది

నాయక్, డాక్టర్ బాబాఫకృద్దీన్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిళ్ల నాగరాజు, పృథ్వీరాజ్, కార్యదర్శి తాయి సుదర్శన్ నితిన్, సభ్యులు డాక్టర్ మదన్, రాఘవేంద్ర, రాజశేఖర్, అభినయ్, దుద్దే రాఘవ, సోమశేఖర్, తాహిర్ వలి, గణేష్, వైద్య సిబ్బంది ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావును ఎపిజిఎస్‌డబ్ల్యూఎస్ దివ్యాంజన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ కోరారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలో ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులను కలిసి వినతి పత్రం అందించారు. గ్రామ, వార్డు సచివాలయ వికలాంగ ఉద్యోగులకు బిఎల్‌ఒ డ్యూటీ, ఆధార్ సెంటర్లు ఇన్‌ఛార్జి విధుల నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు వంద శాతం డిజిబులిటీ కలిగిన ఉద్యోగులకు సిట్టింగ్ పోస్టింగ్స్ ఇప్పించాలని కోరారు. వికలాంగుల చట్టం 2016 పూర్తిగా అమలయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు ఆయా సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు 12వ పిఆర్‌సిని తీసుకు రావడం సంతోషంగా ఉందని ఎపి ఎన్‌జిఒ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిలను హిందూపురం ఎన్‌జిఒ నాయకులు కలిశారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంపై సిఎం జగన్‌తో చర్చించి క్రమబద్ధీకరణ చేసేలా జీవో తీసుకు రావాడం, 12వ పిఆర్సి కమిషన్ వేయించినందుకు హిందూపురం తాలూకా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, అసోసియేషన్ నాయకులు వాసుదేవ, తిమ్మయ్య, తదితరులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా 'కల్పవల్లి' వార్షికోత్సవ సభ

రొద్దం : మండల పరిధిలోని కోగిర కల్పవల్లి సంరక్షణ ప్రాంతంలోని బుష్ క్యాంపులో ఆదివారం 15 వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పవల్లి సొసైటీ వార్షిక నివేదిక, ఆడిట్ రిపోర్టు, పాలకవర్గం మార్పులు, చేర్పులు, తదితర అంశాలపై చర్చించినట్లు టింబక్టివ్ కలెక్టివ్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టింబక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్‌పర్సన్ బబ్లూ గంగోలి, సెక్రటరీ మేరీ వటమట్టం హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు కల్పవల్లి కార్యక్రమం అవశ్యకత, భూమి, నీరు, పర్యావరణ సమతుల్యత, వాతావరణ మార్పులపై వివరించారు. గ్రామంలోని యువత 'కల్పవల్లి' బాధ్యతను తెలుసుకొని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. అనంతరం బుష్ క్యాంపులో యువతీ, యువకులు, పిల్లలకు పర్యావ రణంపై శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టింబక్టివ్ కలెక్టివ్ నుంచి కల్పవల్లి మేనేజర్ శ్రీకాంత్, సొసైటీ సీఈఓ చిరంజీవి, కల్పవల్లి సిబ్బంది, అటవీ సంరక్షణ వాచర్స్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షునిగా భూపతిశివకుమార్

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా ముదిగుబ్బ మండలంలోని కొడవండ్లపల్లికి చెందిన భూపతి శివకుమార్ ఎంపికయ్యారు. కర్నూలులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర నూతన అధ్యక్షునిగా వెల్లాల మధుసూదన్ శర్మను సమావేశంలో ఎన్నుకున్నారు. ఆ సమావేశం లో రాష్ట్ర దేవాదాయ, ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ జిల్లాలోని బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం, సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వైసిపి కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

కదిరి టౌన్ : పట్టణంలోని 31వ వార్డు జెండామాను వీధిలో నివాసం ఉండే వైసిపి కార్యకర్త జాఫర్‌సాబ్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి ఆదివారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని స్థానిక కౌన్సిలర్ ఎస్‌కె వలి జాఫర్ ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్ ఇవ్వాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రం పరిధిలో 8 కి.మీ దూరంలో పని చేసే ఉద్యోగులందరికీ 16శాతం హెచ్‌ఆర్ ఇవ్వాలని సత్యసాయి తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు లింగా రామ్మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం పరిధిలో 8 కి.మీ లోబడి పని చేస్తే ఉద్యోగులందరికీ 16 శాతం హెచ్‌ఆర్ ఇవ్వాలని ప్రభుత్వం జీవో చేసిందన్నారు. అయితే సత్యసాయి జిల్లాలో కేవలం కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి, రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. అన్ని శాఖల ఉద్యోగులకు జీవో ప్రకారం హెచ్‌ఆర్ చెల్లించాలని కోరారు.

శ్మశానవాటికకు సీసీ రోడ్డు

లేపాక్షి : 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో అందిన అర్జీ మేరకు మండల పరిధిలోని మానెంపల్లి పంచాయతీలో శ్మశానవాటికకు వెళ్లేందుకు ఆదివారం సర్పంచి నిర్మల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బాబు, ఎంపీటీసీ నాగరాజు, ఇంజనీర్ అసిస్టెంట్ హరికృష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణంలో కరపత్రాలను అందజేస్తున్న టిడిపి నాయకులు

'వైసిపి ప్రభుత్వానికి అంతిమరోజులు'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వానికి ఇవి అంతిమ రోజులని, రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారం చేపట్టి పేదల జీవితంలో ఆనందం నింపుతుందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ కాచర్ల కంచన్న తెలిపారు. భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంచన్న మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీల పెంపు, ఇంటి, చెత్త పన్ను విధింపుతో పేదల బతుకులు అతలాకుతలం అయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు షాఫిర్, సమీర్, తిరుమలేశ్, రమాదేవి, మంజుల, వసీం, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, టి.చంద్రమోహన్ బాబు, చిన్నూరు లోకేశ్, వెంకీయాదవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

38వ వార్డులో మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో మార్పు మొదలైంది

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో మార్పు మొదలైందని, వచ్చేది టీడీపీ ప్రభుత్తమేనని రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పేర్కొన్నారు. పట్టణంలోని 38వ వార్డులో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ వైసిపి అరాచకాలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, "ఎప్పుడు ఎన్నికలు వస్తాయా వైసిపిని ఇంటికి సాగనంపుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, పరిశే సుధాకర్, బిల్లే శీన, కేశగాళ్ల శీన, నాగూర్ హుస్సేన్, రహీంబాషా, బీరే శ్రీనివాసులు, ఉస్మాన్, రాయపాటి శివ పాల్గొన్నారు.

నిందితులకు కౌన్సెలింగ్

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కదిరి రూరల్ సిఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని పలు కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్షణికావేశంలో ఘర్షణలకు పాల్పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. భార్యా పిల్లలతో ఉండాలంటే ప్రశాంతమైన జీవితం సాగించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు పడకుండా ప్రశాంతంగా ఉండాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో జమేదారులు రామయ్య, తిరుమలరెడ్డి, సిబ్బంది భాస్కరరాజు, బాషా, పలు కేసుల్లో నిందితులు పాల్గొన్నారు

నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ శంకర్‌నాయక్

ఇరుపార్టీల నాయకుల హౌస్‌అరెస్ట్

కొత్తచెరువు : టిడిపి, వైసిపి నాయకులను ముందస్తుగా ఆదివారం తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేసినట్టు సిఐ రాగిరి రామయ్య, ఎస్సై లింగన్న తెలిపారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆరోపణలు చేశారని వైసిపి నాయకులు ఆదివారం ధర్నాకు పిలుపునిచ్చారు. అలాగే టిడిపి నాయకులు ధర్నా చేస్తామని ప్రకటించారు. దీంతో పోలీసులు ముందస్తుగా వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, నాగరాజు, వాల్మీకి శంకర్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, తదితరులను గృహ నిర్బంధం చేశారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

హిందూపురం : పట్టణంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ భూమిని ఆక్రమించామనే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను దేవాదాయ శాఖ భూములు కబ్జా చేసినట్లు ఈవో నాగేంద్రుడు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. తాను దేవాదాయ భూములు కబ్జా చేసి ఉంటే కోర్టుకు వెళ్లవచ్చు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని హితవు పలికారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హిందూపురం : రూరల్ మండలం కిరికెర పంచాయతీ పరిధిలోని మిట్టమీదపల్లి గేట్ వద్ద ఆదివారం రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నారాయణ గుండె, షుగర్ క్లినిక్ వైద్యులు నరసింహారెడ్డి నిర్వహించిన 63వ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గుండె జబ్బులు, బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్యులు నరసింహా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించడం తో పాటు అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు నరసింహా రెడ్డి